సాక్షి
మెదక్
మంగళవారం ı 11 ı మార్చి ı 2025



'పది' రోజులే..
పదో తరగతి పరీక్షలకు కేవలం పది రోజుల సమయం మాత్రమే ఉంది.
వివరాలు 8లో ▸



నైపుణ్యంతోనే స్వయం ఉపాధి
నేర్చుకున్న నైపుణ్యాలతోనే స్వయం ఉపాధి పొందవచ్చని ప్రిన్సిపాల్ దామోదర్ అన్నారు.
వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ — మంగళవారం సా. 6.30 గం.
సహర్ — బుధవారం ఉ. 5.05 గం.

న్యూస్‌రీల్

పైరవీలకు తావులేదు



ఫిర్యాదును పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి సంప్రదించాలని.. పైరవీలకు తావులేకుండా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందని తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయండి

మెదక్‌జోన్: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 31లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఫీజు చెల్లించిన వారికి ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ వర్తిస్తుందనే విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీపాల్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గాజులమ్మగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రంగు రంగుల గాజులతో అలంకరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి, నాయకులు కృష్ణ, సామ్యానాయక్, వెంకట్రాంరెడ్డి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

111 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 5,640 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 5,529 హాజరయ్యారు. మరో 111 మంది వివిధ కారణాలతో పరీక్షకు హాజరు కాలేదని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్, సమస్యలు ఉత్పన్నం కాలేదని చెప్పారు.

'స్థానిక' ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించండి



సంతకాల సేకరణ చేపడుతున్న దివ్యాంగులు

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులకు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షురాలు యశోద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మెదక్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు చట్టాలు చేసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాము అధికారంలోకి వస్తే చట్టంలో సవరణలు చేసి దివ్యాంగులకు రెండు పోస్టులు నామినేట్ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. దీని ద్వారా దివ్యాంగులకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కవిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి తగ్గింపు!

పరిమితంగా పనులు.. తగ్గుతున్న కూలీలు ● జిల్లాలో 15 వేల మంది మాత్రమే హాజరు

వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల కడుపు నింపటం లేదు. పనులు సకాలంలో ప్రారంభించకపోవటం.. అవి కూడా పరిమితంగా చేపట్టడంతో కూలీల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉపాధి పనులకు తక్కువ సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు.



సర్దనలో ఓ రైతు పొలంలో పాంపండ్ పనులు చేస్తున్న కూలీలు

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 1.64 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా, 3.31 లక్షల మంది కూలీలు ఉన్నారు. కాగా జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని స్థానికంగా కల్పించాల్సి ఉంటుంది. గతంలో గ్రామాల్లో వరినాట్ల సీజన్ ముగియగానే ప్రజలు కోరుకునే పనులకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి పనులు చేయించేవారు. అయితే ఫిబ్రవరిలో పనులు ప్రారంభించాల్సి ఉండగా, నేటికీ అనేక గ్రామాల్లో పనులు మొదలు పెట్టలేదు. గతేడాది మార్చి మొదటివారం నుంచే నిత్యం 30 వేల పైచిలుకు కూలీలు పనులు చేయగా, ఈ ఏడాది కేవలం 15 వేల మంది మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. గతంలో పల్లెల్లో చెరువు, కుంటల్లో నుంచి మట్టిని తీసేవారు. ఆ మట్టిని చాలా మంది రైతులు వారి పంట పొలాల్లోకి తరలించేవారు. అది పొలాలకు ఎరువుగా ఉపయోగపడేది. దీంతో ఒక్కో గ్రామంలో రోజుకు వంద నుంచి 200 మంది కూలీలు పనులు చేసేవారు. ఈఏడాది ఆ పనులు నిలిపివేయడంతో కూలీలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధ్యానం

ఈ ఏడాది చెరువు, కుంటల్లో నుంచి మట్టిని తీసే పనులు నిలిపివేసిన ప్రభుత్వం, వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇచ్చింది. పంట పొలాల వద్దకు మట్టి రోడ్లు వేయటం, ఫారెస్ట్ మధ్యలో ఉన్న రోడ్లకు ఫైర్ ట్రెంచ్, ఇంకుడు గుంతల నిర్మాణం, పంట పొలాల్లో నీటి నిల్వ గుంతలు, పశువుల, గొర్రెల షెడ్డుల నిర్మాణాలు, పశుగ్రాసం పెంపు, ఎస్సీ, ఎస్టీల భూముల్లో ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు, బోరుబావుల రీఛార్జ్ తదితర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాగా వీటిలో ఒక్క ఫారెస్ట్‌లో నిర్వహించే ఫైర్ ట్రెంచ్ నిర్వహణ పనులకు మాత్రమే కూలీలు అధిక సంఖ్యలో అవసరం ఉంటారు. మిగితా పనులకు అతి తక్కువ మంది మాత్రమే అవసరం. కానీ అడవుల్లో నేటికీ అనేక చోట్ల ఫైర్ ట్రెంచ్ నిర్వహణ పనులు చేపట్టడం లేదు.

గిట్టుబాటు కాని కూలీ

సగటున ఒక్కో కూలీకి రోజుకు రూ. 300 గిట్టుబాటు కావాల్సి ఉండగా, ప్రస్తుతం రూ. 220 కూలీ మాత్రమే గిట్టుబాటు అవుతునట్లు పలువురు కూలీలు చెబుతున్నారు. ప్రస్తుతం నీటి నిల్వ గుంతలు (పాంపండ్) పనులు చేపడుతున్నామని, నేల గట్టిగా ఉండడంతో చేతులకు బొబ్బలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకూ నీరందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, కలెక్టర్ ఇతర అధికారులు

మెదక్ కలెక్టరేట్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమావేశమై తగు సూచనలు సలహాలు చేశారు. ఇరిగేషన్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు కచ్చితంగా క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి వృథా లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నీటి పొదుపు విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమన్వయంతో పనిచేస్తూ నీటి కొరత రాకుండా చూడాలని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏఓ వినయ్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పూలే' అణగారిన వర్గాల ఆశాజ్యోతి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: అణగారిన వర్గాల అభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే కృషి చేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్జమరి మల్లేశం అన్నారు. సోమవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్న జాతులు, అణగారిన వర్గాల కోసం భర్త జ్యోతిరావు పూలేతో కలిసి పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. మహిళ విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. మహిళలకు చాలా పరిశ్రమల్లో నేటికీ సమాన పనికి- సమాన వేతనం అందడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో అయినా వారికి 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, నాయకులు సత్యం, శ్యాంసన్, రాణి పాల్గొన్నారు.

ప్రజావాణికి 60 వినతులు

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలపై 60 అర్జీలు అందజేశారు. కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా గుణాత్మక పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అ దనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి 30 శాతం నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతుందన్నారు. ప్రధానంగా సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఏడాదిగా హాస్టల్, మెస్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయ కులు ని ఖిల్, విష్ణు సాంసన్, బాలరాజు పాల్గొన్నారు.

కరస్పాండెంట్‌కు షోకాజ్ నోటీస్

సాక్షి ఎఫెక్ట్..

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్ గ్రామ శివారులో అనుమతులు రాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టిన తీరుపై సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'ప్రైవేట్ ఇష్టారాజ్యం' కథనానికి అధికారులు స్పందించారు. యూకేజీ నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్, పాఠశాలకు సంబంధించిన కరపత్రాల పంపిణీపై మూడు రోజుల్లో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఎంఈఓ లీలావతి సోమవారం జాన్స్ అకాడమీ కరస్పాండెంట్‌కు షోకాజ్ నోటీస్ అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఏదైనా ప్రవేశ పరీక్షను నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన సొసైటీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి పూర్తి అనుమతులు వచ్చిన తర్వాతే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు నిధులు

- నిర్మాణానికి రూ. 200 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే 25 ఎకరాలు కేటాయింపు



ఇంటిగ్రేటెడ్ స్కూల్ నమూనా

రామాయంపేట(మెదక్): ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 200 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఉత్వర్తులు అందాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి రామాయంపేట పట్టణ శివారులో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొదటి విడతలో 14 నియోజకవర్గాకు ఈ స్కూళ్లు మంజూరయ్యాయి. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు సామాజిక అంతరాలు లేని అన్నివర్గాలకు చెందిన 2,500 పైగా విద్యార్థులకు ఇందులో అవకాశం కల్పించనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు.. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్కూల్ భవన నిర్మాణం జరపనున్నారు. ఈ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు వసతి కల్పించనున్నారు. హాస్టళ్లు, కంప్యూటర్ల గదులు, ఆడిటోరియం, అవుట్ డోర్, ఇండోర్ జిమ్, క్రీడా మైదానాలు, టెన్నీస్ కోర్టు, వంటశాల, గ్రంథాలయాలు, క్రీడలకు సంబంధించి వేర్వేరుగా భవనాలు నిర్మించనున్నట్లు సమాచారం. క్రీడలతో పాటు కళలకు ఈ స్కూల్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మూడు నెలల క్రితం జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్)/చిన్నశంకరంపేట: రామాయంపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని ముద్దాపూర్‌లో ముత్యాల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. పాపన్నపేట మండలంలో అంతర్జాతీయ స్థాయిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ముద్దాపూర్ శివారులో రెండు బ్రిడ్జిలు, ఆలయం వరకు సీసీ రోడ్డు, బోరు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట చిన్నశంకరంపేట నాయకులు ఆవుల గోపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, గౌస్, ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింలు తదితరులు ఉన్నారు. అనంతరం చిన్నశంకరంపేట మండలంలోని భగీరథపల్లిలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని అన్నారు. గతంలో సొంత జిల్లాలోని ఏడుపాయలను దర్శించుకునే సమయం కూడా అప్పటి సీఎంకు లేకపోయిందని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి దుర్గామాతను దర్శించుకొని అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

డీఈఓ రాధాకిషన్



అల్లాదుర్గం: పాఠశాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

అల్లాదుర్గం(మెదక్)/పెద్దశంకరంపేట/చేగుంట(తూప్రాన్): జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాటు చేసినట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. సోమవారం అల్లాదుర్గం జెడ్పీ, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించనున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంఈఓ ధనుంజయ్య ఉన్నారు. అనంతరం పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సులభ రీతిలో బోధన చేయడంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈసందర్భంగా ఎఫ్ఎల్ఎన్ ద్వారా ఏ విధంగా బోధన చేపడుతున్నారో పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మక్కరాజీపేటలో పనిచేసిన సీఆర్పీల కుటుంబాలకు ఆర్థికసాయం పత్రాలను అందజేశారు.

రవాణా శాఖలో అవినీతిని అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్ వ్యవస్థను రద్దు చేసి అవినీతిని అరికట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ రవాణా శాఖలో అనధికార వ్యక్తులు అన్నింటా పెత్తనం చెలాయిస్తూ చెలరేగిపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వాహనదారులు, అధికారులకు మధ్య ఏజెంట్లు మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్నీ తెలిసిన ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంజీవులు, సంపత్‌కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్, సంజీవులు, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. వానరాల విలాపం



చెట్ల నీడలో సేద తీరుతున్న వానర మూక

మండుతున్న ఎండలకు మనుషులే తట్టుకోలేక పోతున్నారు. ఇక మూగ జీవాల సంగతి సరేసరి. కోతులు ఎండ వేడిమిని భరించలేక చెట్ల నీడను ఆశ్రయిస్తున్నాయి. మిరుదొడ్డిలో మిట్ట మధ్యాహ్నం వేళ వానరాలు స్థానిక పెద్దచెరువు కట్టపై ఉన్న చెట్ల నీడన చేరి ఉపశమనం పొందుతున్న ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. - మిరుదొడ్డి(దుబ్బాక)

డిజిటల్ కట్నాలు..

డిజిటల్ జమానా.. జేబులో ఫోన్ ఉంటే చాలు వివిధ రకాల చెల్లింపులకు నగదు బదిలీ సాధారణమైంది. తాజాగా ఈ ట్రెండ్ వివాహ వేడుకలకూ పాకింది. వివాహ వేడుకకు హాజరైన వారు డిజిటల్ పద్ధతిలో కూడా కట్నాలు చదివించుకోవచ్చు అన్నట్లు సంబంధీకులు 'క్యూఆర్' కోడ్ స్కానర్‌ను అందుబాటులో పెట్టారు. పెళ్లికి వచ్చిన వారు దీనిని చూసి నయా ట్రెండ్ భళే ఐడియా అంటూ ఆశ్చర్యపోయారు. డిజిటల్ కట్నాలు చదివించడం వర్గల్ మండలం గౌరారంలో చోటుచేసుకుంది. - వర్గల్(గజ్వేల్)



వివాహ వేడుకలో కట్నాలు చదివించుకునేందుకు 'క్యూఆర్' కోడ్ స్కానర్

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి


వినోద్ రెడ్డి(ఫైల్)

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా తొగర్‌పల్లి గ్రామానికి చెందిన గొరెల్లి వినోద్ రెడ్డి(33) అన్నతో కలిసి క్యాటరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 7న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఏడుపాయల్లోని మంజీరా నది రెండో వంతెన సమీపంలో బండ రాళ్లపై మృతదేహామై కనిపించాడు. తలకు బలమైన గాయాలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు విష్ణు వర్ధన్ రెడ్డి ఘటనా స్థలికి చేరుకొని తమ్ముడి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశాడు.

ఆర్థిక సమస్యలతో ఉరేసుకొని ఆత్మహత్య

సంగారెడ్డి క్రైమ్: ఆర్థిక సమస్యలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శీలనైని నాగేశ్వరావు (43) కొన్నేళ్లుగా పాల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. సంగారెడ్డిలోని రాజ్యంపేటకు చెందిన కవితను 2011 ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు. వ్యాపారంలో నష్టాలు రావడం, దీనికితోడు ఆరోగ్య సమ్యసలు తలెత్తడంతో కుటుంబ పోషణ భారమైంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారి కిడ్నాప్‌కు యత్నం

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వ్యక్తి చిన్నారిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామ అంగన్వాడీ రెండో సెంటర్ వద్ద చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించాడు. గుర్తించిన టీచర్ కృష్ణవేణి అరవడంతో దుండగుడు పరారైయ్యాడు. టీచర్ మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తన

నిందితుడికి ఐదేళ్ల జైలు, జరిమానా

చేగుంట(తూప్రాన్): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన చల్మెడ సురేశ్ అదే గ్రామానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి చేయి చేసుకున్నాడు. ఈ ఘటన రెండు పర్యాయాలు జరుగడంతో బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు 2018 జనవరి నెలలో చేగుంట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలను అందించారు. సోమవారం కేసు పూర్వపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి లక్ష్మీశారద నిందితుడికి రెండు కేసుల్లో ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ కేసులో పీపీగా రాజ్ కుమార్, లైసనింగ్ ఆఫీసర్‌గా విఠల్ ఇన్వెస్టిగేషన్ అధికారులుగా ఎస్‌ఐ సత్యనారాయణ, సీడీఓగా విఠల్ వ్యవహరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


దీపక్ సింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన దీపక్ సింగ్ వికారాబాద్‌లో ఆయుర్వేదిక్ మందులను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నివాసం ఉండే తన అక్క వద్దకు వచ్చాడు. అదే రోజు రాత్రి తిరిగి వికారాబాద్‌కు బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. కానీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు దీపక్ అక్కకు సమాచారం ఇచ్చారు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

క్రేన్ మీద పడి వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రేన్ మీద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన మంగళ్ కుమార్ (27) జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల కిందట తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. తెల్లాపూర్‌లోని ఆకృతి నిర్మాణ సంస్థలో కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లే క్రేన్ వద్ద పని చేస్తున్నాడు. క్రేన్ సామగ్రిని తీసుకొన వెళ్తే సమయంలో ఒక్కసారిగా క్రేన్ ముందు భాగం మంగళ్‌కుమార్‌పై పడింది. దీంతో అక్కడికక్కడే దుర్మణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం ఇలా..


తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

సబ్జెక్ట్ టీచర్ల చిట్కాలు

- ఒత్తిడిని జయించి.. ప్రణాళిక ప్రకారం చదవాలి
- ప్రశ్నల స్వభావాన్ని అర్థం చేసుకొని రాయాలి
- పాఠ్యాంశాల్లోని కీలక భావాలపై దృష్టి సారించండి
- రివిజన్ చాలా ముఖ్యం

జోగిపేట(అందోల్): పదవ తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమవుతుంది. 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేవలం పది రోజులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఒత్తిడి గురికానున్నారు. పరీక్షల్లో విజయవంతం సాధించాలంటే ఆందోళనకు గురి కాకుండా ఒత్తిని జయించాలి. ఈ పది రోజుల్లో ఎలాంటి అంశాలపై దృష్టి పెట్టాలి? సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? వేటికి ప్రాధాన్యం ఇవ్వాలి? ఎలా అధ్యయనం చేయాలి? అనే అంశాలపై పదవ తరగతి సబ్జెక్టులు బోధించే జోగిపేటలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులను 'సాక్షి' పలకరించింది. విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు.

అక్షర దోషాలు లేకుండా..



మొదటి పరీక్ష తెలుగును నిర్భయంగా రాయాలి. ఉన్న సమయాన్ని అనుకూలంగా అధ్యయనం చేయడానికి విభజించాలి. అక్షర దోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతిరాతపై సాధన అవసరం. సామర్థ్యాల వారీగా ప్రశ్నలు వస్తాయి. వీటిపై అవగాహన కోసం సమయాన్ని కేటాయించాలి. ప్రతీ పాఠ్యాంశాన్ని ఆకళింపు చేసుకోవాలి. కీలక భావాలను పలుమార్లు చదువుకోవాలి. బట్టీ విధానానికి స్వస్తిపలికి భావాలను అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. పదజాలం, వ్యాకరణాంశాలను అధ్యయనం చేయాలి. పాఠ్యపుస్తకం చివరన ఉన్న అంశాలను చదవాలి.

– ఏ.మాణయ్య, తెలుగు పండిత్

100 మార్కులు సాధించవచ్చు



ప్రతీ అధ్యాయంలో చివర ఇచ్చిన ముఖ్య అంశాల్లోని సూత్రాలను, నిర్వచనాలను అధ్యయనం చేయాలి. సమస్యల సాధన, కారణాలను తెలపడం నిరూపించడం లాంటి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి. నిరూపక రేఖ గణితం, రేఖా గణితం, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం, బీజీయ సమాసాలపై సాధన చేయాలి. గ్రాఫ్ ఆధారిత సమస్యలపై సాధన అవసరం. నిర్మాణాత్మక సమస్య సాధనపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఓజీవ్ గ్రాఫ్, త్రికోణమితిలో పటాలను గీయడాన్ని ప్రాక్టీస్ చేయాలి. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే పాఠ్యాంశాల్లోని కీలక భావనలపై దృష్టిని సారించాలి.

– త్రినాథరావు, గణితశాస్త్రం

కఠినమైందన్న భావన ఉండకూడదు



భౌతిక శాస్త్రం కఠినమైనదన్న భావన నుంచి బయటపడాలి. కీలక భావనలపై లోతైన అధ్యయనం చేయడం కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. పాఠ్యపుస్తకాల్లోని అంశాలకు నిజ జీవితంలో జరిగే దృగ్విషయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తరగతి గదిలో చేసిన ప్రయోగాలను ప్రాజెక్టులను మరోసారి సాధన చేయాలి. ప్రశ్నల స్వభావాన్ని అర్థం చేసుకొని కీలక భావనలను జోడించి సొంతంగా జవాబులు రాయడం కోసం ప్రశ్నలను తయారు చేసుకోవాలి. బొమ్మలు గీయడం, కాంతికి, విద్యుత్ వలయాలకు సంబంధించిన అంశాలపై సాధన చేయాలి.

– జంగిటి అనిల్‌కుమార్, భౌతికశాస్త్రం

కవి పరిచయాలపై దృష్టి..



గద్య, పద్య భాగాల్లో కవి పరిచయాలపై దృష్టి పెట్టాలి. పద్య భాగం నుంచి 1, 3, 4, 7, 10 పాఠాల్లోని ప్రతీ పదం అర్థం చేసుకోవాలి. దీని వల్ల రెండు లఘు, ఒక వ్యాసరూపక ప్రశ్నలకు సమాధానాలు రాయొచ్చు. లేఖ, వ్యాసరచన, ఇంటర్వ్యూ, పోస్టర్, నటకం, కథ సంభాషణంపై మాదిరి ప్రశ్నలను తయారు చేసుకొని సాధన చేయాలి. వ్యాకరణాంశాల్లో సమాసాలు, విభక్తులు, సంధులు, వాక్యం, క్రియ, కాలాలు, వాయిస్‌లలో కనీసం 10 ఉదాహరణలు రాసుకొని సాధన చేయాలి.

– రాములు, హిందీపండిత్

విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలి



యూనిట్ వారీగా విభజించుకొని అధ్యయనం కొనసాగించాలి. పఠన నైపుణ్యాల కోసం తెలంగాణ, భారతదేశం, అవుట్‌లైన్ పటాలు గీయడంపై దృష్టి పెట్టాలి. యుద్ధాలు, సమకాలిన అంశాలపై దృష్టిపెట్టాలి. ఏడాది పొడవునా చదివిన అంశాలపై ప్రశ్నలను తయారు చేసుకొని వాటికి సమాధానాలు ఇవ్వడంపై సాధన చేయాలి. ఈ సబ్జెక్టులో విశ్లేషణకు ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రశ్నలను తయారు చేసుకొని సమాధానాలు రాయడంపై సాధన చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

– మాంజ్యానాయక్, సాంఘీక శాస్త్రం

ఆంగ్లం అంటే భయాన్ని వీడాలి



విద్యార్థులు ఆంగ్లం అంటే భయాన్ని వీడాలి. చదివిన అంశాలనే మననం చేసుకొని సమాధానాలు రాయాలి. సెక్షన్–సీలో క్రియేటివ్ రైటింగ్‌లో వ్యాసం, బయోగ్రఫీ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. అందుకోసం వీటిపైన సాధన చేయాలి. పదజాలం వ్యాకరణంలోని నాలుగు రకాల అంశాలపై దృష్టి పెట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు పలు కార్యక్రమాల నిర్వహణ ప్రముఖుల జీవిత చరిత్రలు విభిన్న కార్యక్రమాలపై ప్రశ్నలు అడుగుతారు. వీటిని అధ్యయనం చేయాలి.

– అమృత, ఆంగ్లం టీచర్

పాఠ్యాంశాలను రివిజన్ చేసుకోవాలి



ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మొదటి మూడు యూనిట్లు, ఏడో యూనిట్‌లోని ప్రయోగాలకు సంబంధించిన బొమ్మలను గీయడం నేర్చుకోవాలి. సమాచార నైపుణ్యాల్లో పేరాగ్రాఫ్, టేబుల్ వేయడంపై సాధన చేయాలి. విసర్జన, నియంత్రణలతోపాటు చివరి రెండు యూనిట్ల విద్యా ప్రమాణాలకు సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు. వీటిని సాధన చేయాలి. బొమ్మలు గీయడంపై నిరంతరం సాధన చేయాలి.

– విజయ నిరీక్షణ, బయోలాజికల్ సైన్స్

కంచన్‌పల్లిలో 3,700 కోళ్లు మృత్యువాత

- కోళ్ల ఫారమ్‌ను పరిశీలించిన మండల పశువైద్యాధికారి
- కోడి రక్తం, మలం నమూనాలు ల్యాబ్‌కు..

కౌడిపల్లి(నర్సాపూర్): ఏం రోగమొస్తుందో తెలియదుకాని కోళ్లు వేలల్లో మృత్యువాత పడుతున్నాయి. గతవారం కంచన్‌పల్లిలో 8 వేలు, పాంపల్లిలో మూడు వేలు కోళ్లు మృతి చెందగా, సోమవారం మరోసారి కంచన్‌పల్లిలోని రైతు రామక్రిష్ణాగౌడ్ కోళ్ల ఫారమ్‌లో 3,700 కోళ్లు చనిపోయాయి. దీంతో మండల వైద్యాధికారి ఫర్వీన్‌ఫాతిమా కోళ్ల ఫారమ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. రైతు అభ్యర్థన మేరకు చనిపోయిన కోడి రక్తం, మలం నమూనాలను సేకరించగా రైతు రామక్రిష్ణాగౌడ్‌తో సంగారెడ్డిలోని ల్యాబ్‌కు తీసుకువెళ్లాడు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. టెస్ట్ రిపోర్ట్ వస్తేనే ఏ వ్యాధితో చనిపోయింది చెప్పగలమన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిని ఇప్పుడే నిర్ధారణ చేయలేమని చెప్పారు. వైరస్ వ్యాప్తి చెందకుండా చనిపోయిన కోళ్లను గుంతతీసి పూడ్చిపెట్టాలన్నారు. కోళ్ల ఫారమ్‌లో కోళ్లు చనిపోతుండటంతో కంపెనీ యాజమాన్యం దానా పంపడంలేదని దీంతో దాణా లేకపోడం, ఎండ వేడిమికి సైతం కోళ్లు చనిపోయే ఆస్కారం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.


చనిపోయిన కోళ్లను పరిశీలిస్తున్న డాక్టర్ ఫర్వీన్‌ఫాతిమా

జిల్లాతో అనుబంధం మర్చిపోలేనిది


ఎస్పీని పరేడ్ గ్రౌండ్‌కు తీసుకువస్తున్న పోలీసులు

ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి జోన్: ఎస్పీగా నా మొదటి పోస్టింగ్ సంగారెడ్డి అని.. జిల్లాతో నాకున్న అనుబంధం ఎప్పటికీ మరచిపోలేనని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో బదిలీ అయిన ఎస్పీ రూపేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విధాయి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ.. జిల్లాలో మెరుగైన సేవలు అందించడంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాత్ర ఎంతగానో ఉందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పుష్పగుచ్ఛంతో అలంకరించిన పోలీసు వాహనంలో ఎస్పీ, వారి కుటుంబ సభ్యులను పరేడ్ గ్రౌండ్ నుంచి కార్యాలయ ఆవరణ వరకు తాడు సహాయంతో తీసుకువచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బల్దియా బడ్జెట్ ఢమాల్

- గతేడాదితో పోల్చితే రూ.25 కోట్లు తగ్గుదల
- అంచనా బడ్జెట్ రూ.75.19 కోట్లు
- ఆదాయ, వ్యయ అంచనాల్లో స్వల్ప తేడా
- సిద్దిపేట మున్సిపాలిటీ బడ్జెట్‌కు ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం


మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో గరిమా అగర్వాల్, చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: జిల్లాలోని ఏకైక స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేట పెద్ద పద్దు(బడ్జెట్)ను సోమవారం ప్రవేశపెట్టారు. గతేడాది బడ్జెట్ రూ.104 కోట్లతో పోల్చితే సారి రూ.25 కోట్ల ఆదాయ, వ్యయ అంచనాల్లో తగ్గుదల కనిపించింది. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సమక్షంలో 2025–26 అంచనా బడ్జెట్, 2024–25 సవరణ అంచనా బడ్జెట్‌లను కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025–26 అంచనా బడ్జెట్‌లో వివిధ రూపాల్లో మున్సిపాలిటీకి రూ. 75.19 కోట్ల ఆదాయం చూపించగా, వివిధ ఖర్చుల కింద రూ.75.14 కోట్ల అంచనాతో రూపకల్పన చేశారు. 2024–25 సవరణ బడ్జెట్ మిగులు నిల్వతో కలిపి 2025–26కు గాను రూ. 2 కోట్ల 12 లక్షల ముగింపు నిల్వగా బడ్జెట్ పొందుపరిచారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 2025–26 ఆదాయ, వ్యయ బడ్జెట్ పరిశీలిస్తే కేవలం రూ.4లక్షల స్వల్ప తేడా కన్పించింది.

ఆదాయమిలా..

మున్సిపాలిటీకి సంబంధించిన 2025–26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ మేరకు వివిధ రకాల మార్గాల్లో రూ.75.19 కోట్ల అంచనా ఆదాయంతో పద్దు ప్రవేశపెట్టారు. వీటిలో వివిధ రకాల పన్నులు, అసైన్డ్ రెవెన్యూ ఆదాయంతో కలిపి రూ.22.95 కోట్లు కాగా, మున్సిపాలిటీ స్థిరాస్తుల అద్దెల రూపంలో రూ3.65 కోట్లు, టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా రూ.9.92 కోట్లు ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.5.68 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్, రుణాల రూపంలో రూ.15.74 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్టు పరిధిలోని నాన్ ప్లాన్ గ్రాంట్స్, ప్లాన్ గ్రాంట్స్, కలిపి రూ.15.29 కోట్లతో మొత్తంగా. రూ 75.19కోట్ల రాబడితో అంచనా బడ్జెట్ రూపొందించారు.

వ్యయమిలా..

సిద్దిపేట బల్దియా ఆదాయ పద్దుకు దగ్గరగా వ్యయ అంచనా రూపకల్పన చేశారు. మున్సిపల్ వేతనాలు, జీతాల కింద రూ.14.40 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చు కోసం రూ.5.11 కోట్లు, మున్సిపాలిటీకి చెందిన తాగునీరు ప్రాజెక్టులు, పంప్ హౌస్, ఇతర అవసరాల విద్యుత్ చార్జీల రూపంలో రూ.9 కోట్లు, హరిత బడ్జెట్ కింద రూ.4.41 కోట్లు, అప్పుల చెల్లింపు కోసం రూ 90 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణకు రూ.5 కోట్లు, సాధారణ పరిపాలన విభాగం వ్యయం కింద రూ.2.31 కోట్లు, వెనుకబడిన, మురికివాడల ప్రాంతాల మౌలిక వసతుల కల్పన కోసం రూ.93 లక్షలు, వార్డుల వారీగా పనుల వ్యయం కింద రూ కోటి, డిపాజిట్లు అడ్వాన్స్ చెల్లింపు పద్దు కింద రూ.15.74 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్టు ఫండ్ కింద రూ.15.29 కోట్లు మొత్తంగా రూ.75.19 కోట్ల వ్యయ అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు కొండం కవిత, వంగ రేణుక, కాటం శోభ, తస్లీమ్ సాకి బాల్‌లక్ష్మీ, దీప్తి, పూర్ణిమ, శ్రీదేవి, కవిత, విశోభ, సుందర్, బ్రహ్మం, రవి, అరవింద్, మల్లికార్జున్, సాయి కుమార్, సాయి ఈశ్వర్, లక్ష్మణ్, ప్రవీణ్, నాగరాజు రెడ్డి, యోగి, రియాజ్, వినోద్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడుగా కోళ్ల పూడ్చివేత

నర్సాపూర్ డివిజన్ పరిధిలో వేలాదిగా మృతి

నర్సాపూర్ : కోళ్ల ఫారాలలో చనిపోయిన కోళ్లను గుట్టు చప్పుడు కాకుండా పూడ్చి వాటి మరణంతో పాటు వాటికి సోకిన జబ్బు బయటికి తెలియకుండా దాచిపెడ్తున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో కోళ్ల ఫారమ్‌ల్లోని కోళ్లు బర్డ్ ఫ్లూ వైరస్ సోకి చనిపోతుండగా నర్సాపూర్ ఏరియాలో వేలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. కోళ్లు చనిపోగానే గోతులు తవ్వి వాటిని పూడ్చివేసే విధంగా ఇంటిగ్రేటెడ్ కోళ్ల కంపెనీలు చర్యలు తీసుకోవడంతో ఈ ప్రాంతంలో కోళ్ల మరణంపై స్పష్టత రావడం లేదు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని లింగాపూర్, పిల్లుట్ల, గూడూరు, లింగోజిగూడ, కంచన్‌పల్లి, చిట్కుల్, నాయిని జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో వేలాది బాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. లింగాపూర్‌లో నాటు కోళ్లు సైతం చనిపోయాయి.


చనిపోయిన కోళ్లను గోతిలో వేస్తున్న ట్రాక్టర్

కమిషన్ ఇస్తూ పాతిపెట్టాలని సూచన

కోళ్ల ఫారాల షెడ్లు కల్గిన రైతులకు పలు కంపెనీలు కోడి పిల్లల మొదలు వాటికి కావాల్సిన మందులు, దాణా సరఫరా చేస్తున్నాయి. కోళ్లు కోతకు రాగానే తీసుకెళ్లి వాటి బరువును బట్టి రైతుకు కమిషన్ చెల్లిస్తుంటారు. కోళ్లు చనిపోవడంతో ఆయా కంపెనీలకు నష్టం సంభవిస్తున్నా కోళ్లు పెంచిన రైతులకు కంపెనీలు కొంత కమిషన్ ఇస్తూ చనిపోయిన కోళ్లను పాతి పెట్టాలని సూచిస్తున్నారు కోళ్లు చనిపోయిన విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో కోళ్లకు సోకిన వైరస్ తేలడం లేదని విమర్శలు వస్తున్నాయి.

శాంపిల్స్ సేకరణ

కోళ్లు చనిపోయిన విషయం తెలిస్తే వాటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపిస్తున్నామని స్థానిక పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు చెప్పారు. కోళ్లు చనిపోయిన విషయం తమకు తెలియడం లేదని చెప్పారు. కోళ్లకు సరిపడా దాణా పెట్టనందున పలు చోట్ల కోళ్లు చనిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై లభ్యం

హుస్నాబాద్‌రూరల్: రెండు నెలల కిందట అదృశ్యమైన వ్యక్తి అడవిలో శవమై కనిపించిన ఘటన హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. బండోజు నర్సింహచారి(53) మతిస్థిమితం లేక రెండు నెలల కిందట అదృశ్యమయ్యాడు. జాడ కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, పొరుగు గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మహ్మదాపూర్ శివారులో సైదాపూర్ మండలం శివరాముపల్లి ఉంటుంది. రెండు గ్రామాల మధ్య అడవిలోకి గొర్రెల కాపరులు సోమవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లగా అక్కడ ఓ వ్యక్తి మృతదేహం కన్పించడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. మహ్మదాపూర్ గ్రామస్తులకు విషయం తెలియడంతో నర్సింహచారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య రాజమణి మృతదేహాన్ని పరిశీలించి తన భర్తదేనని గుర్తించింది. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు సైదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

46 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్


బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

ఖేడ్ పట్టణంలో 30

నారాయణఖేడ్: పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఖేడ్ పట్టణంలో నిల్వ ఉంచిన గోదాంపై సోమవారం విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. డీఎస్పీ వెంకటేశం కథనం మేరకు.. పట్టణంలోని రాయిపల్లి రోడ్డులో శివరామ్ అనే బియ్యం వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన దుకాణం వెనుక గోదాంలో నిల్వ చేసినట్లు సమాచారం అందింది. దీంతో సీఐ పండరి, ఎస్‌ఐ వెంకటేశం, తహసీల్దార్ ప్రభాకర్‌తో కలిసి దాడి చేశాం. 60 బస్తాల్లో నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకొని ఆర్‌ఐ మాధవరెడ్డి పంచనామా చేసిన అనంతరం పౌరసరఫరాల గోదాముకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.


పట్టుబడిన రేషన్ బియ్యం

శివ్వంపేటలో 16

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి కొత్తపేట చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ ఆటో ట్రాలీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా గుర్తించారు. అనంతరం సివిల్ సప్లయ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సివిల్ సప్లయ్ జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ వచ్చి 16 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. రాయగిరి అనే వ్యక్తి యశ్వంత్‌రావుపేట్ నుంచి వెల్దుర్తికి బియ్యం తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ దారుణ హత్య

- తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని రెండో భర్త దాడి
- పరారీలో నిందితుడు
- గజ్వేల్ మండలంలో ఘటన

గజ్వేల్‌రూరల్: తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని కక్ష పెట్టుకున్న రెండో భర్త భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో నివాసముండే సాదతుల్లా–అస్రాబేగం(45) దంపతులకు 30 ఏళ్ల కిందట వివాహం కాగా వీరికి ముగ్గురు కుమారులు, కూతురు ఉంది. అస్రాబేగం హైదరాబాద్‌లోని ఓ అడ్వకేట్ వద్ద అటెండర్‌గా పని చేస్తున్న క్రమంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ప్రాంతానికి చెందిన అస్లాం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త సాన్నిహిత్యం ఏర్పడి పెళ్లి చేసుకున్నారు. నాలుగేళ్లుగా ఇద్దరూ ఇండోర్‌లోనే ఉండిపోయారు. అనంతరం మూడేళ్లుగా అస్రాబేగం హైదరాబాద్‌లోని తన పిల్లల వద్దకు రాకపోకలు సాగిస్తుండేది. ఆమె మొదటి భర్త అస్రాబేగం మొదటి భర్త సాదతుల్లా మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలోని ఓ పెట్రోల్ బంక్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలల కిందట అస్రాబేగం–రెండో భర్త అస్లాంల మధ్య మనస్పర్థలు రావడంతో డిసెంబర్‌లో అస్రాంబేగం హైదరాబాద్‌కు తిరిగి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది.


అస్రాబేగం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పోలీసులకు ఫిర్యాదు చేసిందని కోపంతో..

అస్లాం తనను వేధిస్తున్నాడని, అతడి వద్ద తన సామగ్రి ఉందని వాటిని ఇప్పించాలని ఫిబ్రవరిలో అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీన్ని మనసులో పెట్టుకున్న అస్లాం హైద్రాబాద్‌కు వచ్చాడు. అక్కడ మరోసారి అస్రాబేగంను కలిసి ఆమెతో చనువుగా ఉండే ప్రయత్నం చేశాడు. ఇద్దరూ కలిసి ఆదివారం అర్ధరాత్రి రిమ్మనగూడలో శివారులోని పెట్రోల్ బంక్‌లో ఉంటున్న సాదతుల్లా వద్దకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అస్రాబేగం–అస్లాంల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఆమెపై పారతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన సాదతుల్లాపై దాడికి పాల్పడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. మహిళ హత్య విషయం తెలుసుకున్న గజ్వేల్ సీఐ సైదా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.